క్లుప్తంగా

రేపు వాహనాల వేలం

కలికిరి: కలికిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ కేసులలో పట్టుబడిన వాహనాలు వేలం వేయనున్నట్లు ఎస్ఐ కే.రహీముల్లా తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్, నాటు సారా కేసులలో పట్టుబడిన 14 వాహనాలకు సంబంధించి మంగళవారం స్టేషన్ ఆవరణలో బహిరంగవేలం నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.4వేలు డిపాజిట్టు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని ఆయన పేర్కొన్నారు

పీఎం కిసాన్‌కు ఈ-కేవైసీ నమోదు తప్పనిసరి

పెద్దతిప్పసముద్రం: పీఎం కిసాన్ నగదు జమ కావాలంటే ఖచ్చితంగా ఈ-కేవైసీ నమోదై ఉండాలని ఏఓ ప్రేమలత అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ మండలంలో ఈ-కేవైసీ నమోదు కాని రైతులు 729 మంది ఉండగా వీరిలో టి.సదుం, పట్టెంవాండ్లపల్లి, రంగసముద్రం పంచాయతీల్లోని రైతులు అధికంగా ఉన్నారన్నారు. సంబంధిత రైతులు సమీపంలోని రైతు భరోసా కేంద్రానికి వెళ్ళి ఈ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు.

గర్నిమిట్ట యల్లమ్మకు విశేషపూజలు

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్టలో వెలసిన యల్లమ్మతల్లికి విశేష పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకం, వివిధ రకాల పుష్పాలతో అలంకరణ, ప్రత్యేక పూజలు, మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం చేపట్టారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు మంగళవాయిద్యాలతో బోనాలు ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయ ప్రదక్షిణలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

ఆటో బోల్తా.. ఆరుగురికి గాయాలు

మదనపల్లె సిటీ: ఆటోబోల్తా పడి ఆరుగురు గాయపడిన సంఘటన నిమ్మనపల్లె మండలం మర్రిబండవద్ద ఆదివారం సాయంత్రం జరిగింది. పోలీసుల కథనం మేరకు వాల్మీకిపురం మండలం చింతపర్తికి చెందిన కుటుంబ సభ్యులు కలిసి బోయకొండ దర్శనం కోసం ఆటోలో వెళ్లారు. తిరిగి ప్రయాణంలో మర్రిబండ వద్ద ఆటో బోల్తా పడటంతో ఆటో ప్రయాణిస్తునన చంద్రరూప(29),కవిత(35), రామక్క (70),ప్రేమలత(46), సురేంద్ర(6) గాయపడగా, పద్మావతి (50) తీవ్రంగా గాయపడటంతో తిరుపతికి రెఫర్ చేశారు. ఔట్‌పోస్టు పోలీసులు నిమ్మనపల్లె పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు.

కారు ఢీ కొని వ్యక్తికి గాయాలు

ద్విచక్రవాహనంలో ఇంటికి వెళుతున్న ఓ వ్యక్తిని కారు ఢీకొనడంతో గాయపడిన సంఘటన మదనపల్లె పట్టణం బెంగుళూరు బస్టాండువద్ద ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. మదనపల్లె మండలం బొమ్మనచెరువు పంచాయతీ బొగ్గిటివారిపల్లెకు చెందిన శ్రీరాములు(40) ఇంటికి ద్విచక్రవాహనంలో వెళుతుండగా కారు వేగంగా వచ్చి ఢీకొనింది. ఈ ఘటనలో శ్రీరాములు గాయపడ్డాడు. స్థానిక జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఎంఆర్‌పీఎస్ జిల్లా అధికార ప్రతినిధిగా రవిమాదిగ



మదనపల్లె సిటీ: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పిఎస్) జిల్లా అధికార ప్రతినిధిగా మదనపల్లెకు చెందిన వై.రవిమాదిగను నియమించారు. ఈ మేరకు ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు నాగరాజుమాదిగ ఉత్తర్వులు జారీ చేశారు. గత రెండు సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత సాధన కోసం జరుగుతున్న ఉద్యమంలో కీలకపాత్ర పోషిస్తున్న రవి మదనపల్లె పట్టణ అధ్యక్షులుగా పని చేశారు. రవి మాట్లాడుతూ ఎంఆర్‌పిఎస్ బలోపేతం కోసం కృషి చేస్తానని తెలిపారు.

కొలువుదీరిన గంధపు పీర్లు



రామసముద్రం: మండలంలోని దిగువపేట, ఎగువపేట , ఆర్.నడింపల్లి గ్రామాల్లో మొహర్రం ఉత్సవాలలో భాగంగా ఆదివారం గంధపు పీర్లను అలంకరించారు. హిందూ, ముస్లింలు అత్యంత భక్తితో పీర్లను కొలువుదీర్చారు. తొమ్మిది రోజుల పాటు జరిగే మొహర్రం వేడుకలను తిలకించడానికి వేలాది మంది భక్తులు పాల్గొంటారని కమిటీ సభ్యులు తెలిపారు.

మొహర్రం వేడుకలు ప్రారంభం

మదనపల్లె సిటీ: హిందూ, ముస్లిం సోదరుల ఐక్యమత్యానికి చిహ్నంగా నిలిచే మొహర్రం పండుగ వేడుకలు స్థానిక జామియా మసీదు వద్ద పపాయ్ మకాన్‌లో ప్రారంభమయ్యాయి. మకాన్ నిర్వాహకులు సంప్రదాయబద్ధంగా గంధం నిర్వహించి పీర్లను ఏర్పాటు చేశారు. పీర్లచావిడిని పూలతో అలంకరించారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు ప్రతి రోజు ఊరేగింపులు నిర్వహిస్తారు. 25న భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 29న మొహర్రం పండుగ రోజు పెద్ద ఎత్తున ఊరేగింపు, జలిది కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హిందూ, ముస్లింలు పీర్లను దర్శించుకుని చక్కర,తీపి పదార్థాలను చదివింపులు చేశారు.

దశాబ్దాల కల సాకారం

- ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి కృషితో స్టేట్‌బార్డర్ రోడ్డుకు మోక్షం
- రూ.23 కోట్లతో డబుల్‌రోడ్డు పనులు
- టీడీపీ హయాంలో ప్రతిపాదనలకే పరిమితం



బి.కొత్తకోట-స్టేట్‌బార్డర్ డబుల్‌రోడ్డు

బి.కొత్తకోట: బి.కొత్తకోట-స్టేట్‌బార్డర్ సింగిల్‌రోడ్డును డబుల్‌రోడ్డుగా చేయాలన్నది ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కల. దీన్ని సాకారం చేస్తామంటూ గత టీడీపీ పాలనలో ఈ రోడ్డును ప్రతిపాదనలు పంపేందుకే పరిమితం చేశారు. రోడ్డు మంజూరుకు కృషి చేయలేదు. ఫలితంగా ఈ రోడ్డు పూర్తిగా దెబ్బతిని ప్రయాణాలు సాగించలేని దుస్థితికి వచ్చింది. రోడ్డంతా దెబ్బతిని, పూర్తిగా గుంతలమయమై, బైక్‌పైనా రాకపోకలు సాగించేందుకు కూడా కష్టతరమైనదిగా మారిపోయింది. ఈ సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి బి.కొత్తకోట బీసీకాలనీ నుంచి కర్ణాటక సరిహద్దు వరకు తారురోడ్డు వేయించి సమస్యను పరిష్కరించారు.

నాడు కేవలం ప్రతిపాదనలే..

గత టీడీపీ హయాంలో స్టేట్‌బార్డర్ రోడ్డు మంజూరుకు ఆరు సార్లు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపారు. రహదారి భవనాలశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపడం వరకే సరిపోయేది. ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి మంజూరు చేయించే విషయంలో గత ఎమ్మెల్యే శంకర్ చొరవ చూపలేదు. దీనితో ప్రభుత్వం ప్రతిపాదనలను పట్టించుకోలేదు. ఫలితంగా 2019 ఎన్నికల తర్వాత ఈ రోడ్డును అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి నిర్ణయించారు. దీనితో పలుమార్లు ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లడంతో రెండేళ్లక్రితమే నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

సుందరమైన డబుల్‌రోడ్డు

కర్ణాటకలోని బెంగుళూరు, గౌనిపల్లె, చింతామణీ, కోలార్, శ్రీనివాసపురం, ముళబాగిలు తదితర పట్టణాలకు వెళ్లాలంటే బి.కొత్తకోట మీదుగా స్టేట్‌బార్డర్ రోడ్డు దాటుకుని వెళ్లాలి. 8.7 కిలోమీటర్ల సింగిల్‌రోడ్డు ప్రయాణం ఇబ్బందికరంగా ఉండేది. ఈ సింగిల్‌రోడ్డును డబుల్‌రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు రూ.23 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఏడాది క్రితమే పనులకు టెండర్లు పూర్తి చేసినా భారీవర్షాలు, రోడ్డు మట్టితో నిండిపోవడం కారణాలతో పనుల్లో జాప్యం జరిగింది. ప్రస్తుతం చేపట్టిన ఈ పనులతో డబుల్‌రోడ్డు పనులకు సంబంధించి తారురోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. కొన్ని రోజుల్లో పనులు పూర్తికానున్నాయి. ఇప్పటికే రోడ్డుపై వాహనాలు రయ్ అంటూ రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ పనికి సంబంధించి తరతరాలుగా కంబాలపల్లె వద్ద ఆలేరువాగు ఉధృత ప్రవాహంతో రాకపోకలు స్తంభించిపోయేవి. భవిష్యత్తులో ఆ పరిస్థితి తలెత్తకుండా కొత్త బ్రిడ్జిని నిర్మించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. డిజైన్ రూపకల్పన పూర్తవగా వాటి అనుమతులు పొందాక టెండర్లు నిర్వహించి బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టనున్నారు.

మణిపూర్ ఘటనకు నిరసనగా ధర్నా



ధర్నా చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

పీలేరు : ఇటీవల మణిపూర్‌లో గిరిజన మహిళలపై జరిగిన ఘటనకు నిరసనగా వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ఆదివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రపంచ దేశాల ముందు తలదించుకునేలా మణిపూర్‌లో గిరిజన మహిళలపై జరిగిన అత్యాచారాలు హేయమైన చర్యగా అభివర్ణించారు. బీజేపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రక్షణ కరువైందని పేర్కొన్నారు. మణిపూర్ శాంతి భద్రతలు నసిస్తుంటే ప్రభుత్వాలు మౌనం వహించి నీచరాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ధరణికుమార్, పాలకుంట శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, ఆనంద్, మల్లికార్జున, సదాశివ, రెడ్డెప్ప, ఖాదర్‌వలి, షాదీక్, మౌలాలిసాబ్, తమీమ్, కృష్ణయ్య, నాగరాజ, తదితరులు పాల్గొన్నారు.

నేడు బాలంవారిపల్లెలో గడపగడపకు మనప్రభుత్వం

పీలేరు : మండలంలోని బాలంవారిపల్లె పంచాయతీలో సోమవారం గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి సదుం హరిజనవాడ, గుర్రంవారిపల్లె, దేశిరెడ్డిగారిపల్లె, నూనేవాండ్లపల్లె, ఒంటేరువారిపల్లె, మొరవపల్లె, నాలేవాండ్లపల్లె, కురవపల్లె గ్రామాల్లో పర్యటిస్తారని చెప్పారు. మండల స్థాయి అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కురబలు ఐక్యమత్యంగా ఉండాలి



ఐక్యత చాటుతున్న కురబ సంఘం నాయకులు

మదనపల్లె సిటీ: కురబలు ఐక్యమత్యంగా ఉండాలని రాష్ట్ర కురుబ, కురుమ సంఘ అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు అన్నారు. ఆదివారం స్థానిక మైసూర్ బ్యాంకు కాలనీలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 5న చిత్తూరు జిల్లా పలమనేరులో సుమారు 25వేల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి ఏపీ, కర్ణాటక ముఖ్యమంత్రులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, సిద్ధరామయ్యలకు ఆహ్వానించనున్నట్లు తెలిపారు. రాయలసీమలో అధికంగా కురబలు ఉన్నారని, ఇందుకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేద్దామన్నారు. కర్ణాటకలో కురబలలు ఐక్యంగా ఉండటంతో కాంగ్రెస్ పార్టీ పది మందికి ఎమ్మెల్యే సీట్లు ఇచ్చినట్లు గుర్తు చేశారు. రాయలసీమలో రెండు నెలల పాటు జిల్లా, డివిజన్, నియోజకవర్గ, మండల స్థాయి కమిటీలు పూర్తి చేస్తామన్నారు. కనకదాస్ జయంతి ప్రభుత్వం తరపున చేయడానికి అంగీకారం తెలిపినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు,రెడ్డికుమార్, ఈశ్వరయ్య, కార్యదర్శి నాగేంద్ర, ప్రచార కార్యదర్శి విఠల్‌గౌడ్,యువత అధ్యక్షులు రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గౌరవ వేతనాలకు దరఖాస్తు చేసుకోండి

– వక్ఫ్ బోర్డు జిల్లా అధ్యక్షుడు కరీముల్లా

వాల్మీకిపురం: ముస్లిం మైనార్టీలు, మసీదు కమిటీ ప్రెసిడెంట్లు, సెక్రటరీలకు వక్ఫ్ బోర్డు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మసీద్ పేష్ ఇమామ్‌లకు రూ.10వేలు, మౌజన్‌లకు రూ.5వేలు గౌరవ వేతనం ఇస్తోందని, ఇమామ్, మౌజన్‌లు వెంటనే దరఖాస్తులు చేసుకోవాలని వక్ఫ్ బోర్డు జిల్లా అధ్యక్షుడు ఎస్‌ఏ కరీముల్లా ఓ ప్రకటనలో తెలిపారు. ఆదాయం లేని, దరఖాస్తులు సమర్పించని మసీదుల ప్రెసిడెంట్లు, సెక్రటరీలు వారి వారి సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకొని, ఎంపీడీఓ ద్వారా కలెక్టర్ కార్యాలయంలోని ఇన్‌స్పెక్టర్ ఆడిటర్ వక్ఫ్ బోర్డు వారికి వారంలోగా అందజేయాలని సూచించారు. వివరాలకు 9440579622, 8333076786 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం అశేష భక్త జనసందోహంతో కిటకిటలాడింది. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. సంతానం కోసం మహిళలు అమ్మవారి ఎదుట వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి చీరె, సారెలతో మొక్కులు చెల్లించారు. పలువురు భక్తులు ఆలయంలో అన్నదానం చేశారు. తమిళనాడు, కర్ణాటకాతో పాటు రాయలసీమ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా తిలక్, ఆజాద్‌ల జయంతి



తిలక్, ఆజాద్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

వాల్మీకిపురం: వాల్మీకిపురం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం లోకమాన్య బాలగంగాధర్ తిలక్, విప్లవ వీరుడు చంద్రశేఖర్ ఆజాద్‌ల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక తరిగొండ రోడ్డులోని మైనార్టీ గురుకుల పాఠశాలలో తిలక్, ఆజాద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెవీవీ అధ్యక్షుడు ప్రభుచరణ్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం నా జన్మ హక్కు అని చాటిన స్వాతంత్ర్య సమరయోధుడు బాలగంగాధర్ తిలక్ అని, బ్రిటిష్ వారి చేతుల్లో మరణించకూడదని తనను తానే తుపాకీతో కాల్చుకున్న గొప్ప దేశభక్తుడు చంద్రశేఖర్ ఆజాద్ అని వారి సేవలను, గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మంజుల, ఉపాధ్యాయులు జిలానిభాషా, సురేఖ, విద్యార్థులు పాల్గొన్నారు.

వలంటీర్ కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం



నగదు సాయం చేస్తున్న మొరుసు కాపు సంఘం నాయకులు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని టి.సదుం పంచాయతీ పరిధిలో గ్రామ వలంటీర్‌గా పని చేసే తలారి జయచంద్ర (27) విద్యుత్ షాక్ కారణంగా గత నెల 10న మృతి చెందాడు. మొరుసు కాపుల సంఘం నాయకులు దాసరిపల్లి జయచంద్రారెడ్డి, దేవరింటి బాబు బ్రదర్స్, రవిచంద్రారెడ్డి, ఆంజనేయరెడ్డి కలసి ఆదివారం టి.సదుంలోని వలంటీర్ ఇంటికి వెళ్ళి మతుడి భార్య సునీతకు తమ వంతు సాయంగా రూ.50 వేల నగదును అందజేశారు. వీరి వెంట మొరుసు కాపు నాయకులు ఎంఎస్ చంద్రశేఖర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి,లోకనాథ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, గంగుల్‌రెడ్డి, కేశవరెడ్డి, మస్తాన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

జయప్రదాదేవి సేవలు మరువలేనివి



జయప్రదాదేవి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

కలకడ : కలకడ పట్టణంలో 30 సంవత్సరాలు అంగన్‌వాడీ వర్కర్‌గా లక్ష్మిరెడ్డి జయప్రదాదేవి అందించిన సేవలు మరువలేనివని ఎంపీపీ శ్రీదేవి, సింగిల్ విండో అధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జయప్రదాదేవి పదవీ విరమణ సన్మాన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కలకడలో చిన్నారులకు, కిషోర బాలికలకు, గర్భిణులకు పోషక ఆహారపదార్థాలు అందించి, జాగ్రత్తలు తెలియజేసి ఎంతో సేవ చేశారని కొనియాడారు. అనంతరం విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కె.లక్ష్మిరెడ్డి-జయప్రదాదేవిల దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు సుమిత్రమ్మ, సర్పంచ్ ప్యారీజాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు షౌకత్‌అల్లీఖాన్, జిలానీ, రాము, వైఎస్సార్‌టీయుసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యశోధరాణి పాల్గొన్నారు.

అబ్దుల్ ఖాదర్‌కు సన్మానం



అబ్దుల్ ఖాదర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కలికిరి: పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు, రచయిత వేంపల్లి అబ్దుల్ ఖాదర్‌కు ఆదివారం స్థానిక షాదీమహల్‌లో విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. రచయితగా సమాజ శ్రేయస్సు కోసం అబ్దుల్ ఖాదర్ కృషిని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ఐ కె.రహీముల్లా, ఎస్‌బిఐ మేనేజర్ శ్రీనివాసులు, విశ్రాంత ఉద్యోగుల సంఘం నేతలు గురురాజారావు, సురేంద్రరెడ్డి, ఆదినారాయణరెడ్డి, సత్యనారాయణ, కెవై క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రోగులకు ఆహార పొట్లాల పంపిణీ

మదనపల్లె సిటీ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం శంకర్‌నేత్రాయల నిర్వహించిన ఉచిత కంటి శిబిరానికి వచ్చిన రోగులకు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుబ్బారెడ్డి ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు చంద్రశేఖర్ ప్రతి నెలా కంటి వైద్యశిబిరానికి వచ్చే రోగులకు ఉచితంగా ఆహార పొట్లాలను అందిస్తున్నారు. ఆయన చేస్తున్న సేవలను హెచ్‌ఎం అభినందించారు. కార్యక్రమంలో క్యాంపు నిర్వాహకులు చిన్నా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సేవకు సలాం



రైతు నేస్తాలు వలంటీర్లు



వేరుశనగ పంటను ఆర్బీకే సిబ్బందితో కలసి ఈక్రాప్ చేయిస్తున్న వలంటీర్ నరసింహ

గుర్రంకొండ మండలంలోని ఎల్లుట్లలోని పలు గ్రామాల్లో వలంటీర్లు రైతుల నేస్తాలుగా మారి సేవలు అందిస్తున్నారు. గతంలో పంట నమోదు చేసుకోవడంగానీ, పంట నష్టపరిహారం అనే మాట గ్రామాల్లో వినబడేవి కావు. మండలకేంద్రంతో పాటు పలుకుబడి రాజకీయనాయకులు, ప్రజాప్రతినిధుల గ్రామాల్లో మాత్రమే అక్కడక్కడా ఇలాంటి పదాలు వినిపించేవి. అలాంటి సమయంలో జగనన్న ముఖ్యమంత్రి అయిన వెంటనే రైతుల సంక్షేమం కోసం ఆర్బీకేలు ఏర్పాటు చేశారు. అయితే అక్కడ పనిచేసే సిబ్బంది అన్ని గ్రామాల్లో సకాలంలో చేరుకోలేని పరిస్థితి. ఈనేపథ్యంలో వలంటీర్లు ఆర్బీకే సిబ్బంది వెంట రైతుల పొలాలకు వెళ్లి రైతులకు కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తున్నారు. నరసింహ అనే వలంటీర్ గత నాలుగేళ్లుగా తమ పరిధిలోని రైతులకు కావాల్సిన సమాచారం అందిస్తున్నాడు. రైతులకు ఎలాంటి సాయంకావాలన్నా ఇంట్లో కుటుంబసభ్యుల లాగా వలంటీర్ సేవలు అందుతున్నాయి. **- గుర్రంకొండ**

వలంటీర్ల సేవలు ఆదర్శనీయం



గ్రామంలో వలంటీర్ల సేవలు అందరికీ ఆదర్శనీయం. గతంలో ఎప్పుడూ పంటల నమోదు, పంట నష్టపరిహారం ఇవ్వడం చూడలేదు. ఆర్బీకేలు వచ్చిన తరువాత వలంటీర్ల సాయంతో మేము ఎంతో లాభపడుతున్నాం. పంటలు సాగు చేసిన సమయంలో వలంటీర్ ఆర్బీకే సిబ్బందితో కలసి మా పొలం వద్దకే వచ్చి పంట సాగు నమోదు చేయిస్తారు. ప్రభుత్వం నుంచి మాకు పంట నష్టపరిహారం కూడా అందుతోంది.

- రవీంద్ర, పసలవాండ్లపల్లె, గుర్రంకొండ

శభాష్ లక్ష్మికాంత్



తిరుపతి రుయాలో మల్‌రెడ్డికి పింఛన్ అందిస్తున్న వలంటీర్

కలకడ మండలం కోన పంచాయతీ గ్రామంలో వలంటీర్ లక్ష్మీకాంత్ లబ్ధిదారులకు సేవలు అందిస్తూ శభాష్ అనిపించుకుంటున్నాడు. డిగ్రీవరకూ చదివి సామాజిక సేవలు అందించడంలో ఆయన కృషి ప్రశంసనీయం. కరోనా సమయంలో సైతం కోన సర్పంచ్ జల్లా రాజగోపాల్‌రెడ్డి చొరవతో పారిశుధ్యం పనులు చేయించడం, ఆరోగ్యసిబ్బందితో పాటు పాల్గొంటూ ప్రజలను చైతన్య పరిచాడు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందించడం కోసం దగ్గరుండి దరఖాస్తు చేయించి వారికి అందేలా కృషి చేస్తున్నాడు . ప్రతినెలా 1వతేదీ ఉదయాన్నే లబ్ధిదారుల తలుపు తట్టి పింఛన్ అందిస్తాడు. ప్రభుత్వం మూడు పర్యాయాలు సేవారత్న, సేవామిత్ర అవార్డులు అందించింది. కోన గ్రామానికి చెందిన మల్‌రెడ్డి తిరుపతిలోని రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా వంద కిలోమీటర్లుకు పైగా వెళ్లి పింఛన్ అందజేశాడు.

-కలకడ

వలంటీర్ సాయంతో పింఛన్



పింఛన్‌కు అర్హత పొందగానే మొదటి రోజే నా వద్ద ఉన్న బియ్యం కార్డు, ఆధార్‌కార్డు, వయస్సు ధ్రువపత్రం తీసుకుని వృద్ధాప్య పింఛన్‌కు వలంటీర్ లక్ష్మీకాంత్ దరఖాస్తు చేయించాడు. ఉన్నతాధికారులు, ప్రభుత్వం చలవతో వారం లోపే పింఛన్ మంజూరైంది. ప్రతి నెలా 1వతేదీ ఇంటికి వచ్చి పింఛన్ డబ్బులు అందిస్తున్నాడు. అలాగే ఆరోగ్య సమస్యలు ఏవైనా ఉన్నాయా అని ఆరాతీసి తన వంతు సాయం చేస్తున్నాడు.

- వై.మల్‌రెడ్డి, కోన, కలకడ మండలం

పథకాలను విమర్శిస్తే ప్రజలే బుద్ధి చెబుతారు



మట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

– ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్

వాల్మీకిపురం: రాష్ట్రంలో అమలు అవుతున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక, సంక్షేమ పథకాలను తప్పుపడుతున్న పీలేరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ నల్లారి కిషోర్ కుమార్ రెడ్డికి ప్రజలే బుద్ధి చెబుతారని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ కార్యదర్శి రాయుడు, జర్రావారిపల్లి సర్పంచ్ మునిభాస్కర్ అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారనడం విడ్డూరంగా ఉందన్నారు. గత టీడీపీ పాలనలో దాదాపు రూ.2లక్షల కోట్లు అప్పులు చేసిన విషయాన్ని మరిచిపోయి మాట్లాడుతున్నారన్నారు. చంద్రబాబు నాయుడు పాలనలో చేసిన అప్పులను పోల్చుకుంటే, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేసిన అప్పులు తక్కువేనన్నారు. ప్రజలను సోమరిపోతులను చేస్తున్నారని విమర్శిస్తున్న టీడీపీ నేత కిషోర్ కుమార్ రెడ్డిని ప్రజలు క్షమించరన్నారు. టీడీపీకి భవిష్యత్తు ఉండదన్న భయంతోనే చౌకబారు విమర్శలు చేస్తున్నారన్నారు. కరోనా కష్టకాలంలో నియోజకవర్గ ప్రజల బాగోగులను పట్టించుకోకుండా తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాదులో కూర్చొన్న కిషోర్ కుమార్ రెడ్డి ఎన్నికలు వస్తుండడంతో నియోజకవర్గాన్ని అప్పుడప్పుడు విజిట్ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేష్ కుమార్ రెడ్డి, ఆనంద, చలపతి, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ముప్పంగి నాగరాజు

పీలేరు : మాదిగల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు మొదటి వారంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ముప్పంగి నాగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక టీటీడీ కల్యాణమండపంలో విశ్వరూప మహాసభ సన్నాహక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు హలో మాదిగ..చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మహాసభకు ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు దుద్దు రామకృష్ణ, రాజు, హరిబాబు, మనోహర్, ప్రేమ్‌కుమార్, సుధాకర్ బాబు, గండికోట వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.